క్లుప్తంగా

నిషేధం ఎత్తివేయాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న నాయకులు

జన్నారం: పగటిపూట జన్నారం మీదుగా భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలో సోమవారం అఖిల పక్ష నాయకుల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎఫ్‌డీవో రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. భారీ వాహనాలను పునరుద్ధరించే వరకు ఆందోళనలు విరమించేది లేదన్నారు. దీక్ష చేపట్టిన సామాజిక వేత్త భూమాచారి, బీజేపీ గిరిజనమోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్‌ల రిలే దీక్షలకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, బీఆర్ఎస్ నాయకులు భరత్‌కుమార్, విజయధర్మా, జనార్దన్, బీజేపీ మాజీ అధ్యక్షుడు గోలి చందు, నాయకులు సూర్యం, గోపాల్, మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు కాసెట్టి లక్ష్మణ్, వర్తక, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

కోతకు వచ్చిన ఆయిల్ పాం


ఆయిల్ పాం గెలలు చూపిస్తున్న రైతు

దండేపల్లి: గత నాలుగేళ్ల క్రితం దండేపల్లి మండలంలోని వెల్గనూర్ గ్రామానికి చెందిన మేడిశెట్టి లింగయ్య ఆయిల్ పాం సాగు చేశాడు. ప్రస్తుతం కోతకు రావడంతో సోమవారం గెలలను కోశారు. వాటిని ఓ ప్రైవేట్ కంపెనీ టన్నుకు రూ.18,050 రూ.18,050 చొప్పున కొనుగోలు చేసింది.

108లో ప్రసవం

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రానికి చెందిన చెండె సుగుణ పురిటి నొప్పులతో ఆదివారం అర్ధరాత్రి బాధపడుతుండగా ఆమె కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. ఆస్పత్రికి తీసుకెళ్తుండగా తాళ్లగురిజాల వద్ద నొప్పులు అధికమయ్యాయి. వైద్యుల సూచనలతో ఈఎంటీ రాకేశ్, పైలెట్ రంజిత్, ఆశ కార్యకర్త వాణి సుఖప్రసవం చేయగా, ఆడబిడ్డ జన్మించింది. అనంతరం వారిని బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

‘హామీల అమలులో కాంగ్రెస్ విఫలం’


మాట్లాడుతున్న రితీశ్‌రాథోడ్

జన్నారం: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్ విమర్శించారు. సోమవారం జన్నారంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్యాస్ సబ్సిడీ, ఉచిత కరెంటు అనేక మందికి వర్తించడం లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అవకతవకలు జరుగుతున్నాయని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే ఇళ్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు, జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, ప్రధాన కార్యదర్శి గోపాల్, నాయకుడు లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

నమూనా ఎన్నికలు


ఓటు వినియోగించుకుంటున్న విద్యార్థులు

చెన్నూర్: విద్యార్థులకు విద్యార్థి దశలోనే సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు వినియోగంపై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో కళాశాల, పాఠశాల స్థాయిల్లో ఎన్నికలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తెలిపారు. పూర్తిగా సార్వత్రిక ఎన్నికల నమూనా ఎన్నికలను నిర్వహించి గెలుపొందిన అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఉపాధ్యాయులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఏటీపీ రాజేందర్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.


పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా...


బెంచ్‌పై కూర్చోవడానికి వీలు లేకుండా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు


ఆకతాయిలు ధ్వంసం చేసిన బెంచ్

వాకింగ్ ట్రాక్ కళావిహీనం..!

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పోచమ్మ చెరువు వద్ద సుందరీకరణ పనులు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. రూ.లక్షలు వ్యయం చేసి చేపట్టిన పనులు అనతి కాలంలోనే అధ్వానంగా తయారయ్యాయి. క్రీడాకారులు, వాకర్స్, పుర పౌరుల కోసం నిర్మించిన వాకింగ్ ట్రాక్ కళావిహీనంగా తయారైంది. పిచ్చిమొక్కలు పెరిగి, వృక్షాల కొమ్మలు విరిగి పడి, నరికివేతకు గురై ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. సేద తీరడం కోసం ఏర్పాటు చేసిన బెంచీలను కమ్ముకుని మొక్కలు ఎదుగుతుండగా, మరికొన్నిబెంచీలు కింద పడిపోయి విరిగిపోయాయి. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేక ఆ ప్రాంతమంతా మందుబాబులు, గంజాయి ప్రియులకు నిలయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం లేక తిప్పలు..!


గంగారంలో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు (ఫైల్)

- అన్ని సౌకర్యాలు ఉన్నా అవస్థలు తప్పట్లే
- గతంలో 15 రోజులు నడిపించి, బంద్ చేసిన అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

చెన్నూర్‌రూరల్: సుద్దాలకు బస్సొచ్చిందని ఆయా గ్రామాల ప్రజలు ఎంతగానో సంతోషపడ్డారు. కానీ వారి సంతోషం ఎంతోకాలం నిలువలేదు. 15 రోజులకే అధికారులు బస్సును బంద్ చేశారు. దీంతో మండలంలోని కాచన్‌పల్లి, గంగారం, తుర్కపల్లి, దుబ్బపల్లి, కమ్మరిపల్లి, సుద్దాల గ్రామాల ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. కాచన్‌పల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వాగుపై గతంలోనే వంతెన నిర్మించారు. ప్రస్తుతం కిష్టంపేట, సుద్దాల గ్రామాల మధ్యలో సుద్దాల వాగుపై వంతెన నిర్మించారు. అయినప్పటికీ ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

బస్సు సౌకర్యం మూణ్నాళ్ల ముచ్చటే...

2022జనవరి 27న ఆర్టీసీ అధికారులు చెన్నూర్ నుంచి సుద్దాలకు బస్సు ప్రారంభించారు. దీంతో తమ ప్రయాణ కష్టాలు గట్టెక్కాయని ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కానీ పదిహేను రోజుల తర్వాత బస్సు రద్దయింది. దీంతో ప్రజలు నిరాశకు గురవుతున్నారు. నిత్యం ఆయా గ్రామాల ప్రజలు అవసరం నిమిత్తం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. వాగులపై వంతెనలు ఉన్నా బస్సు సౌకర్యం ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నిస్తున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



కాచన్‌పల్లి, సుద్దాల గ్రామాల మధ్య వాగులపై వంతెనలు నిర్మించారు. కానీ బస్సు సౌకర్యం లేదు. గతంలో కాచన్‌పల్లి మీదుగా 15రోజులు ఆర్టీసీ బస్సు నడిపించారు. ఆ తర్వాత రద్దయ్యింది. మళ్లీ ఎవరూ పట్టించుకోలేదు. మాకు బస్సు సౌకర్యం కల్పించాలి.

– దివాకర్, కాచన్‌పల్లి

ప్రైవేటు వాహనాలే దిక్కు..



మా గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలనే ఆశ్రయిస్తున్నాం. గతంలో ఆర్టీసీ బస్సు నడిపించినా కొన్నిరోజులకే బందు చేశారు. మళ్లీ మాకు బస్సు సౌకర్యం కల్పించాలి.

– మల్లేశ్, సుద్దాల

కదిలించిన కథనం..!


బట్టిగూడెం కాలనీలో పిచ్చి మొక్కలు తొలగిస్తూ..


జగన్నాథాలయం పక్కన...

- కాలనీల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు
- పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కల తొలగింపు

సాక్షి స్పందన

చెన్నూర్: మున్సిపాలిటీలోని బట్టిగూడెం, జోగిని కాలనీల్లో పారిశుద్ధ్యం పేరుకుపోయి, పిచ్చి మొక్కలు పెరిగి, దోమలతో వ్యాధుల బారిన పడి ఇద్దరు చనిపోగా ‘సాక్షి’ ప్రజల ఇబ్బందులను గుర్తించింది. ‘ ఎక్కడి చెత్త అక్కడే’ శీర్షికన సోమవారం కథనం ప్రచురించింది. దీంతో అధికార యంత్రాంగం కదిలింది. పట్టణంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. బట్టిగూడెంలో పిచ్చిమొక్కలు, జగన్నాథాలయం పక్కన గల చెత్తను తొలగించారు. మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లినట్లు మున్సిపల్ కమిషనర్ మురళికృష్ణ, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరికాంత్ తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన ‘సాక్షి’కి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ కెమెరాలకు ఎన్ఆర్ఐ ఆర్థికసాయం


ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావుకు నగదు అందిస్తూ...

బెల్లంపల్లి: మున్సిపల్ మాజీ కౌన్సెలర్ తోడే వంశీకృష్ణారెడ్డి జయంతిని పురస్కరించుకొని జ్ఞాపకార్థంగా తన సోదరుడైన ఎన్ఆర్ఐ వెంకట కృష్ణారెడ్డి సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక వితరణ చేశారు. బెల్లంపల్లి వన్‌టౌన్‌లో సోమవారం ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావుకు తన సన్నిహితులైన న్యాయవాది మాదరి రాకేష్, 22వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకుడు పీక లక్ష్మణ్ ద్వారా రూ.30వేలు నగదు అందించారు.

చెట్టుకు షాక్..!



భీమారం: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో రోడ్డు పక్కనే గల వేపచెట్టుకు విద్యుత్ తీగలు తాకడం వల్ల చెట్టుకు షాక్ వస్తోంది. ఈ విషయంలో విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో తెలియని వాళ్లు చెట్టుని తాకే అవకాశం ఉందని, అధికారులు చర్యలు చేపట్టి తీగలకు తాకుతున్న కొమ్మలను నరికించి ప్రమాదాల నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

నరికేశారు.. వదిలేశారు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని మారుతినగర్‌లో విద్యుత్ శాఖ సిబ్బంది కరెంట్ తీగలకు తాకుతున్నాయని కాలనీ గుండ ఉన్న చెట్ల కొమ్మలను నరికివేసి డ్రెయినేజీ కాల్వలో పడేశారు. పది రోజులుగా కాల్వలో ఉంటుండడంతో డ్రెయినేజీ నీరు కాల్వలో నిల్వ ఉంటుందని కాలనీవాసులు వాపోతున్నారు. రోజుల తరబడి డ్రెయినేజీలో నీరు అగడం వల్ల వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, వెంటనే చెట్ల కొమ్మలు తొలగించాలని కోరుతున్నారు.



నిఘానేత్రం.. నిర్వహణ శూన్యం..!



భీమారం: మండలంలోని పోలంపల్లిలో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి. గ్రామంలోకి వచ్చిపోయే వారి కదలికలను భద్రపరిచేందుకు, అనుమానాస్పద వ్యక్తులను, దొంగలను త్వరగా గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో అవి ప్రస్తుతం పనిచేయడం లేదు. అధికారులు స్పందించి సీసీ కెమెరాలు బాగుచేయించాలని ప్రజలు కోరుతున్నారు.


బైక్‌కు అమర్చిన ట్రాలీలో కూర్చొని వెళ్తున్న వ్యక్తులు

బైక్ ట్రాలీ.. భలే బాగు

చెన్నూర్‌రూరల్: ట్రాలీ ఆటోలు, బొలెరా ట్రాలీలు చూస్తుంటాం కానీ ఇందుకు భిన్నంగా ఓ వ్యక్తి బైకును ట్రాలీగా తయారుచేసి ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరుస్తూ ఆదాయం అర్జిస్తున్నాడు. మండలంలోని శివలింగాపూర్ సమీపంలో సోమవారం ఈ బైక్‌ట్రాలీని ‘సాక్షి’ క్లిక్‌మనిపించింది.

ఊపందుకున్న వరినాట్లు

దండేపల్లి: వానాకాలం పంట సాగులో భాగంగా దండేపల్లి మండలంలో వరిసాగు పనులు ఊపందుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు తోడు, మరో వైపు కడెం ప్రాజెక్టు నీళ్లు కూడా రావడంతో కడెం ఆయకట్టుతో పాటు, వ్యవసాయ బావుల కింద వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో ఎక్కడ చూసిన వ్యవసాయ సాగు పనుల్లో రైతులు బిజీబిజీగా కనిపిస్తున్నారు.


వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు

కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు

చెన్నూర్‌రూరల్/రామకృష్ణాపూర్/దండేపల్లి/తాండూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు సోమవారం కొనసాగాయి. ప్రసవం అయిన గంటలోపు వచ్చే ముర్రుపాలలో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, వీటిని పిల్లలకు తప్పకుండా పట్టించాలని ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని సూచిస్తున్నారు. గర్భిణులకు శ్రీమంతం, పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. వేంపల్లిలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో తల్లిపాల వారోత్సవాలపై ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుంది. వైద్యులు, అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.


దండేపల్లి: ధర్మరావుపేటలో...

సంక్షిప్త వార్తలు

● అధికారులపై చర్యలు తీసుకోవాలి

పాతమంచిర్యాల: సింగరేణి కార్మికుల రక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు అన్నారు. సోమవారం జిల్లా సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6న మందమర్రి జీఎం కార్యాలయ ముట్టడించనున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, సహాయ కార్యదర్శి దూలం శ్రీనివాస్,ఉపాధ్యక్షులు ప్రకాష్ పాల్గొన్నారు.

● 6న జిల్లాస్థాయి అత్య–పత్యా పోటీలు

రామకృష్ణాపూర్: ఈ నెల 6న రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్‌స్టేడియంలో 8వ సబ్ జూనియర్ జిల్లా స్థాయి అత్య–పత్యా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆత్య–పత్యా జిల్లా అధ్యక్షుడు గాండ్ల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి ఉప్పులయ్య తెలిపారు. బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వయస్సు ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులతో ఉదయం 10గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

● పీఎం కిసాన్ సమ్మాన్ నిధి రెట్టింపు చేయాలి

తాండూర్: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం మొత్తాన్ని రెట్టింపు చేయాలని సీపీఎం పార్టీ మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యుడు దాగం రాజారామ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇకపై రూ.12వేలు చెల్లించాలన్నారు. సీపీఎం నాయకులు వేల్పుల శంకర్, నానయ్య, మొగిళి తదితరులు పాల్గొన్నారు.

● జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు

తాండూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): జీవాల్లో ప్రబలే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తాండూర్ మండల పశు వైద్యాధికారి పీ.వీ.నర్సింహరావు, హాజీపూర్ మండల పశువైద్యాధికారిణి శాంతిరేఖ అన్నారు. తాండూర్ మండలం కొత్తపల్లిలో, హాజీపూర్ మండలంలో సోమవారం వేర్వేరుగా గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

జీఎంకు వినతిపత్రం అందజేత

నస్పూర్: ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి ఉత్సవాలను సింగరేణి కాలరీస్‌లో యాజమాన్యం అధికారికంగా నిర్వహించాలని సింగరేణి కాలరీస్ బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీరాంపూర్ ఏరియా నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 6న ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ నాయకులు సోమవారం జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బీసీ లైసన్ ఆఫీసర్ సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు ముస్కె సమ్మయ్య, పేరం రమేశ్ పాల్గొన్నారు.

పరేడ్ అలవెన్స్ చెల్లించాలి

మందమర్రిరూరల్: మందమర్రి డివిజన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు పరేడ్ అలవెన్స్ చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సింగరేణి హైస్కూల్ ఆవరణలో సోమవారం గార్డులతో కలిసి మాట్లాడారు. ఏరియా సెక్యూరిటీ గార్డులు ఉన్నారు.

ఘనంగా అభిషేక పూజలు


శివుడికి రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు

దండేపల్లి: శ్రావణ సోమవారం సందర్భంగా దండేపల్లి మండల కేంద్రంలోని శ్రీ శివభక్త మార్కండేయ ఆలయంలో శివలింగానికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. ప్రసాద వితరణ చేశారు.

శివుడికి ప్రత్యేక పూజలు

మంచిర్యాలఅర్బన్: శ్రావణ మాసంలో భాగంగా రెండో సోమవారం స్థానిక రాళ్లపేట్ గౌతమినగర్ శివపంచాయితన ఆలయంలో సోమవారం రాత్రి శివుడికి లక్షబిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. అర్చకుడు శశాంక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

బుగ్గ ఆలయానికి భక్తుల తాకిడి

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కన్నాల శివారులో ఉన్న శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కోనేటిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. పాలాభిషేకం, బిల్వార్చనతో పాటు ఇతర ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

జన్నారం: లంబాడ హక్కుల పోరాట సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా జన్నారం మండలం కవ్వాల్ హాస్టల్ తాండ గ్రామానికి చెందిన బాదావత్ శ్రీనివాస్‌నాయక్‌ను నియమించారు. హైదరాబాద్‌లోని ఐహెచ్‌పీఎస్ కార్యాలయంలో సోమవారం ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మూడవత్ రాంబాల్ నాయక్ ఆయనకు నియామకపత్రం అందజేశారు.

‘స్థానిక’ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి


పథకాలు వివరిస్తున్న రఘునాథ్, నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తమ ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు వెరబెల్లి రఘునాథ్ పిలుపునిచ్చారు. బీజేపీ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం హాజీపూర్ మండలంలోని పడ్తనపల్లిలో ప్రధాని మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గాజుల ముఖేశ్‌గౌడ్, మోటపలుకుల తిరుపతి, స్వామిరెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాస్, రాజనర్సు, ప్రశాంత్, సతీశ్, రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.